## క్లుప్తంగా

### ముచ్చట్ల మల్లన్నకు ప్రత్యేక పూజలు



ముచ్చట్ల మల్లికార్జున స్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామసమీపంలో వెలసిన ముచ్చట్ల భ్రమరాంబా సమేత మల్లికార్జునస్వామికి శ్రావణమాస చివరి సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి వేదపండితులు నరేష్‌శర్మ, అర్చకుడు చంద్రశేఖర్‌రావు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అలాగే గ్రామ సమీపంలో వెలసిన బ్రహ్మసూత్ర సహిత నాగలింగేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త చిన్ని శేషఫణి ఆధ్వర్యంలో స్వామి వారికి రుద్రాభిషేకం చేశారు.

### రైతుల భూముల్లో సర్వే రాళ్లు ఏర్పాటు



మీర్జాపురంలో సర్వే రాళ్లు పాతడాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

కొలిమిగుండ్ల: జగనన్న భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా మీర్జాపురంలోని రైతుల భూముల్లో సర్వే రాళ్లను సోమవారం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ దోసిఆల్‌ఫ్రెడ్ సరిహద్దు రాళ్ల పాతే విధానాన్ని పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మీర్జాపురంలో 900 రాళ్ల పాతే కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. మండలంలో మొదటి విడతలో బి.ఉప్పలూరు, కొలిమిగుండ్ల, మీర్జాపురం గ్రామాల్లో పూర్తి స్థాయిలో రీసర్వే పూర్తి కావడంతో సరిహద్దు రాళ్లు పాతిస్తున్నామన్నారు. రైతులకు ప్రభుత్వం నుంచి మంజూరు చేసే భూహక్కు పత్రాలు త్వరలో పంపిణీ చేస్తామన్నారు.

### క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడాదుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్యాపిలి: మండల పరిధిలోని రాచర్ల ఉన్నత పాఠశాల విద్యార్థులకు కర్నూలులోని సేవ్ ట్యాక్స్ కన్సల్టెన్సీ కంపెనీ నిర్వాహకులు సాయినాథ్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు రూ.15 వేల విలువ చేసే క్రీడా దుస్తులు అందజేశారు. దుస్తులను సోమవారం న్యాయవాది నాగభూషణ్ రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉమాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకుడు దివాకర్ రెడ్డి, గ్రామ పెద్దలు నరసింహారెడ్డి, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

### అప్రెంటిషిప్‌లో 32 మంది ఎంపిక

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో సోమవారం నిర్వహించిన పీఎం జాతీయ అప్రెంటిషిప్ మేళాలో 32 మంది అభ్యర్థులను ఉద్యోగాలు లభించాయని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోనీ, కియా హోండా మొబిస్‌తో పాటు ఏ కె .పవర్ ప్రొడక్ట్స్ తదితర కంపెనీల ప్రతినిధులు రమణారావు, వెంకటేష్, షాబాజ్‌లు హాజరై తమకు కావాల్సిన అభ్యర్థులను ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేసుకున్నారన్నారు.

### 15 లోపు పంటలను నమోదు చేసుకోండి

బేతంచెర్ల: ఈ నెల 15 లోపు సాగు చేసిన పంటలను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ రైతులకు సూచించారు. మండలంలో జరుగుతున్న పంటల నమోదు కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఆర్‌బీకేలలో అగ్రికల్చర్ అసిస్టెంట్లను సంప్రదించి పంటలను నమోదు చేయించుకోవాలన్నారు. పంటలు నమోదు చేసుకోకపోతే ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలకు దూరమవుతారని హెచ్చరించారు.

### సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ

కోవెలకుంట్ల: మండలంలోని చిన్నకొప్పెర్ల గ్రామంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం భూమి పూజ నిర్వహించారు. గ్రామంలోని బీసీ కాలనీలో అంతర్గత రహదారి లేకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను గుర్తించి బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కాలనీలో 250 మీటర్ల మేర సీసీ రోడ్డు, డ్రెయిన్ ఏర్పాటుకు రూ.10 లక్షలు (డీఎంఎఫ్) నిధులు విడుదల చేయించారు. గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మోహన్‌రెడ్డి, చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ చెంచయ్య పాల్గొన్నారు.

# మట్టి గణపతికి జై

- ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో పర్యావరణానికి చేటు
- మట్టి విగ్రహాలతో ప్రకృతికి ఎంతో మేలు
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి ప్రేమికులు

డోన్: విఘ్నాలను తొలగించే వినాయకుడు ఆది దేవుడు. సకల శుభాలు కలిగించేవాడు. ఇలాంటి స్వామి వారి విగ్రహాలను హానికర రసాయనిక రంగులతో తయారు చేస్తుండటంతో అవి పర్యావరణానికి పెనుముప్పుగా మారుతున్నాయి. మరీ ముఖ్యంగా గణనాథుని నిమజ్జనం తర్వాత చెరువులన్నీ టన్నుల కొద్ది వ్యర్థపదార్థాలు నిండిపోవడమే గాక భూగర్భ జలాలు, నీటి వనరులు మలినమైపోతున్నాయి. నీటిలో ఉండే జీవరాశులు మృత్యువాతపడుతున్నాయి. కాలుష్య నివారణకు, పర్యావరణ పరిరక్షణకు, జీవరాశుల సంరక్షణకు హానికలిగించని మట్టితో తయారు చేసిన ఏకదంతుడి విగ్రహాలనే ఈ ఏడాది వినాయకచవితికి ప్రతిష్ఠించాలని పర్యావరణవేత్తలు, ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

డోన్ నియోజకవర్గంలో రానున్న వినాయకచవితికి చిన్న, చితక విగ్రహాలన్నీ కలిపి సుమారు 20వేల వరకు కొలువుదీరే అవకాశం ఉంది. కోరిన వారి కోరికలు తీర్చే మహానాయకుడిగా భక్తులు పూజలు అందుకోనున్న వినాయకున్ని మట్టితో తయారుచేస్తేనే నిజమైన పుణ్యఫలం సిద్ధిస్తుందని పలువురు భావిస్తున్నారు.మట్టితో తయారుచేసే విగ్రహాలను ప్రతిష్ఠించి చెరువుల్లో నిమజ్జనం చేయడం ద్వారా సులువుగా నీటిలో కరిగిపోగలవని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు. పంచభూతాలలో ఒకటైన మట్టితో విగ్రహానికి ప్రాణప్రతిష్ట చేస్తే మంచి ఫలితం ఉంటుందని వేద పండితులు అభిప్రాయపడుతున్నారు. ఆలయాల్లో స్వయంభు దేవతాలయాలకు ఎంత ప్రాముఖ్యత ఉంటుందో మట్టితో చేసిన విఘ్నేశ్వరుని ప్రతిమకు కూడా విశేష శక్తి ఉంటుందని పండితులు పేర్కొంటున్నారు.



మట్టితో తయారు చేసిన వినాయకుని ప్రతిమ

**ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేటు**

ఏటా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసే వివిధ రకాల విగ్రహాలకు విషతుల్యమైన రంగులను అద్దుతున్నారు. వీటినే అనేక మంది వినాయకచవితి రోజు ప్రతిష్ఠిస్తున్నారు. వీటిని నిమజ్జనం రోజున చెరువులు, కుంటల్లో వేయడం మూలంగా నీటిలో కరగడం లేదు. నీరు కలుషితం కావడమే గాక చెరువులు, కుంటలు పూడికతో పేరుకుపోతున్నాయి. హానికరమైన రంగులు, రసాయనాల మూలంగా నీటిలోని జీవరాశులు మృత్యువాతపడుతున్నాయి. ఇలాంటి చెరువుల్లో పెరిగిన చేపలను తినడం ద్వారా ప్రజలు క్యాన్సర్ బారిన పడుతున్నారు. కేవలం మట్టితో తయారుచేసిన విగ్రహాలను ప్రతిష్ఠించి, పూజించి, నిమజ్జనం చేయడం ద్వారా పర్యావరణానికి ఎలాంటి ముప్పు వాటిల్లదని పర్యావరణ వేత్తలు ప్రజలను చైతన్యం చేస్తున్నారు.

**ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం**



ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుంది. శుద్ధ జలాలు కూడా రసాయనాలతో కలుషితమై నీటిలోని సమస్త జీవరాశులు కనుమరుగవుతున్నాయి. ఇలాంటి విగ్రహాల తయారీ వల్ల జరిగే అనర్థాలు, దుష్ఫలితాల గురించి ప్రజలకు వివరించి చైతన్యం చేస్తున్నాం. మట్టి వినాయకులను ప్రత్యేకంగా తయారుచేసి వాటివల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తున్నాం.

– నన్నపనేని సుమిత్ర రాజేష్, ప్రకృతి ప్రేమికురాలు, హార్టికల్చర్ యూనివర్సిటీ సభ్యురాలు

**ఇంటిలోనే తయారు చేసుకోవచ్చు**



మట్టితో వినాయకులను ఇంటిలోనే తయారుచేసుకోవచ్చు. దీంతో పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుంది. ప్రస్తుత వినాయక విగ్రహాల నిమజ్జనం వల్ల ఘనపదార్థాలన్నీ చెరువుల్లో పేరుకుపోతున్నాయి. జలాల్లోని జీవరాశుల ఉనికి ప్రశ్నార్థకమవుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకొని పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మట్టి విగ్రహాలను తయారు చేసుకోవాలి.

– వెంకటరెడ్డి, ఆర్‌డీటీ, డోన్

### భక్తిశ్రద్ధలతో నాగవిగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్ట చేసిన దృశ్యం

ప్యాపిలి: స్థానిక వెంగన్నబావి సమీపంలో సోమవారం నాగవిగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజారి వీరబ్రహ్మయ్య ఆధ్వర్యంలో గణపతి పూజ, వాస్తుపూజ, నవగ్రహపూజ, పుణ్యాహవచనం, ప్రధాన కలశపూజ తదితర పూజలు నిర్వహించారు. అనంతరం నాగవిగ్రహ ప్రతిష్ఠను వేదమంత్రాల మధ్య నిర్వహించారు. కార్యక్రమంలో అభయాంజనేయ ఆలయ కమిటీ సభ్యులు పరమేశ్వరయ్య, సుధాకర్ రెడ్డి, నారాయణ, సుంకన్న, హరి, శ్రీను, వెంకటరాముడు పాల్గొన్నారు.

### నేత్ర దానం



బాల హనుమంతు(ఫైల్)

డోన్ టౌన్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డోన్ మెయిన్ బ్రాంచ్ రిటైర్డ్ మేనేజర్ బాల హనుమంతు (70) సోమవారం గుండెపోటుతో మరణించారు. ఆయన కళ్లను కుటుంబ సభ్యులు దానం చేశారు. కాగా విషయం తెలుసుకున్న పలువురు పట్టణ వాసులు.. బాలహనుమంతు మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

## చంద్రబాబు అడ్డంగా దొరికిపోయాడు

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో మాజీ సీఎం చంద్రబాబు అవినీతి బయటపడిందని అందువల్లనే కోర్టు ఆయనకు రిమాండ్ విధించినట్లు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. ఇందులో ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలోని సమావేశ భవనంలో ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ సీమెన్స్ కంపెనీవాటా 90 శాతం విడుదల చేయకున్ననూ ప్రభుత్వం 10 శాతం వాటా రూ.371 కోట్లు ఎక్కడికి వెళ్లాయన్న దానిలో చంద్రబాబు సమాధానం చెప్పలేక అడ్డంగా దొరికిపోయాడన్నారు. తన సూట్‌కేసు కంపెనీలకు మళ్లించాడని, ఆధారాలతోనే సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారని తెలిపారు. ప్రజల సొమ్ము తిన్న ఎంతటి వారైనా ఎప్పుడో ఒకసారి కటకటాలు పాలు కాక తప్పదన్నారు. సీఎం వైఎస్ జగన్ అభివృద్ధి, సంక్షేమం కోసం ఎలాంటి అవినీతికి తావులేకుండా రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేశారన్నారు. నిప్పునంటూ చెప్పుకునే చంద్రబాబు.. రెండు ఎకరాల భూమి నుంచి రూ.2 లక్షల కోట్లకు ఎలా ఎదిగారో చెప్పాలన్నారు. ఎన్నో ఆర్థిక నేరాలు చేసి, వ్యవస్థలను మేనేజ్ చేస్తూ వచ్చిన చంద్రబాబు.. పాపం పండిందని, అందుకే జైలు పాలయ్యాడని అన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, నాయకులు బండి బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

## ఆలయాల పునర్నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: మండలంలోని నందవరం గ్రామంలో రూ.40 లక్షలతో బాలబ్రహ్మేశ్వరుడు, వీరభద్రుడు ఆలయాల పునర్నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి భూమి పూజ చేశారు. అంతకు ముందు చౌడేశ్వరి అమ్మవారిని ఎమ్మెల్యే దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ రామానుజన్, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని పురాతన ఆలయాలను దేవదాయశాఖ, టీటీడీ దేవస్థానం సహకారాలతో పునర్నిర్మాణం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కంబగిరిస్వామి, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ పీఆర్ వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పీఆర్ మురళిమోహన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, అల్లె సురేష్‌రెడ్డి, నరసింహారెడ్డి, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కనుల పండువగా శ్రీకృష్ణుని గ్రామోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


కొలిమిగుండ్ల: శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా మీర్జాపురంలో సోమవారం త్రైతసిద్ధాంతం ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని గ్రామోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల ఆశీస్సులతో త్రైతసిద్ధాంత భక్తులు ఆరు రోజుల పాటు శ్రీకృష్ణుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెంగళూరు నుంచి ప్రత్యేకంగా తెప్పించిన పూలతో పల్లకీని అలంకరించి అందులో శ్రీకృష్ణుడిని కొలువుంచి మేళతాళాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్తులు స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం మీర్జాపురం శాఖ సభ్యులు పీఎంఎస్ నాయుడు, రామకృష్ణారెడ్డితో పాటు బాలహంసేనినాయుడు, బీగాల వెంకటసుబ్బయ్య, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## 14న మండల స్థాయి క్రీడా పోటీలు


కొలిమిగుండ్ల: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14న అంకిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ అబ్దుల్‌కలాం తెలిపారు. సోమవారం వివిధ పాఠశాలలకు చెందిన పీఈటీలతో సమావేశం నిర్వహించారు. అండర్ – 14, అండర్-17 విభాగంలో పోటీలు ఉంటాయని, అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొనేలా చూడాలని పీఈటీలకు సూచించారు.

అవుకు: పట్టణ సమీపంలోని జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో మంగళవారం మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ శ్రీధర్‌రావు సోమవారం తెలిపారు.

కోవెలకుంట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం మండల స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ వెంకట్రామిరెడ్డి సోమవారం తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు అకాడమీ మానిటరింగ్ యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎంఈఓ -2 వెంకటసుబ్బయ్య, హెచ్‌ఎం రాజయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి భగవత్ ఖూబకు ఆహ్వానం పలుకుతున్న ఈఓ, అధికారులు



మల్లన్న దర్శనార్థం వస్తున్న కర్ణాటక మంత్రి మల్లికార్జున

## మల్లన్న సేవలో కేంద్ర మంత్రి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను సోమవారం కేంద్ర రసాయన ఎరువుల, పునరుత్పాదన శక్తి సహాయ మంత్రి భగవత్ ఖూబ, కర్ణాటక రాష్ట్ర భూగర్భ, గనుల, ఉద్యానవన శాఖ మంత్రి మల్లికార్జున వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఈఓ ఎస్ లవన్న, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకవేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, ఈఓ స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

# కనపడని బంద్ ప్రభావం

- యథావిధిగా ఆర్టీసీ బస్సుల రాకపోకలు
- సాధారణంగా జనజీవనం



డోన్ పాతబస్టాండ్‌లో సాధారణ జీవన స్థితిగతులు

బనగానపల్లెరూరల్/కోవెలకుంట్ల/డోన్‌టౌన్: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్ట్‌ను నిరసిస్తూ ఆ పార్టీ నేతల నిర్వహించిన బంద్ బనగానపల్లె, డోన్ నియోజకవర్గాల్లో ఎక్కడా కనిపించలేదు. ఆర్టీసీ బస్సులు యథావిధిగా రాకపోకలు సాగించగా.. జనజీవనం రోజులాగే సాగింది. కోవెలకుంట్ల ఆర్టీసీ డిపో అధికారులు ఉదయం 6 గంటల నుంచే ఆయా రూట్లకు బస్సులను తిప్పారు. అవుకు, సంజామల మండలాల్లో రోజుమాదిరిగా కార్యకలాపాలు కొనసాగాయి. కొలిమిగుండ్ల మండలంలో టీడీపీ నాయకులు ఏపీజీబీ, స్టేట్ బ్యాంక్‌ల వద్దకు వెళ్లి బ్యాంక్‌లు బంద్ చేయాలని సూచించినా సిబ్బంది తమ విధులను అలాగే నిర్వహించారు.

- బనగానపల్లెలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ఇంటి సమీపంలోని రోడ్డుపై కొందరు నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొద్ది సేపు నినాదాలు చేశారు.
- డోన్‌లో ప్రజా జీవనానికి ఆటంకం కలగకుండా డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు శరత్‌కుమార్‌రెడ్డి, నగేష్, సుధాకర్ రెడ్డిలు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధర్మారం సుబ్బారెడ్డితో పాటు పలువురు నాయకులను గృహ నిర్బంధం ఉంచారు.
- బేతంచెర్ల:మండల కేంద్రంలోని ప్రధాన రహదారి వెంట టీడీపీ నాయకులు కొందరు ర్యాలీగా పాత బస్టాండుకు చేరుకొని కాసేపు నిరసన చేపట్టారు. సీఐ ప్రియతం రెడ్డి, ఎస్‌ఐ శివశంకర్ నాయక్ అక్కడికి చేరుకుని టీడీపీ నాయకులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.
- మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ ప్రజలు స్వచ్ఛందంగా బంద్ పాటిస్తారని ఆశించిన టీడీపీ నాయకులకు ప్యాపిలీలో నిరాశే మిగిలింది.

### ఆర్థిక సాయం



విద్యార్థులతో చర్చి నిర్వాహకులు

బేతంచెర్ల: నంద్యాల సెయింట్ లూకా బ్లైండ్ స్కూల్ విద్యార్థులకు సిమెంట్ నగర్ గ్రామ సీఎస్ఐ చర్చి సభ్యులు రూ.75 వేల ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం నగదును పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. కార్యక్రమంలో చర్చి అధ్యక్ష, కార్యదర్శులు వినోద్ కుమార్, డేవిడ్ రాజు, కోశాధికారి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### భర్తపై దాడి చేయించిన భార్య

దొర్నిపాడు: భర్తపై.. భార్య తన తల్లిదండ్రులతో దాడి చేయించిన ఘటన సోమవారం డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ మౌలాలి తెలిపిన వివరాల మేరకు.. మూడు నెలల క్రితం ఓర్వకంటి రాజు అనే వ్యక్తికి బండిఆత్మకూరు గ్రామానికి చెందిన యేసేబు, మరియమ్మ దంపతుల కుమార్తె మంజులతను ఇచ్చి వివాహం చేశారు. రెండు నెలలుగా వీరి సంసారం సాఫీగా సాగింది. ఇంట్లో పనులు చేయడం ఇష్టంలేని మంజులత పుట్టింటికి వెళ్లి పోయింది. భర్త ఇంటికి రావాలని పెద్దలతో పంచాయితీ పెట్టించినా ఫలితం లేకపోయింది. సోమవారం మంజులత తల్లిదండ్రులు, అన్నా,వదిన అరుణ్, స్టెల్లా తదితరులు రాజు,అతని తల్లిపై దాడికి పాల్పడి తన వస్తువులను తీసుకొని పుట్టింటికి వెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వివరించారు.

### భళా..మరియప్ప



210కేజీలు ఇసుకబస్తా ఎత్తుతున్న మరియప్ప నాయక్

కోసిగి: 170 కేజీల రాతి గుండు.. 210 కేజీల ఇసుక బస్తాను కర్ణాటక రాష్ట్రానికి చెందిన శారదహళ్లి మరియప్ప నాయక్ అవలీలగా ఎత్తి ప్రజల నుంచి ప్రశంసలు అందుకున్నారు. అదే రాష్ట్రానికి చెందిన యల్లాలింగ అనే వ్యక్తి 150 కేజీల రాతి గుండు, 190 కేజీల ఇసుక బస్తాను ఎత్తారు. వీరికి వరుసగా ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. ఉరుకుంద ఈరన్న స్వామి పల్లకోత్సవం సందర్భంగా కురుకుంద గ్రామంలో సోమవారం క్రీడా పోటీలు నిర్వహించారు. తిప్పలదొడ్డి నుంచి కందుకూరు గ్రామం వరకు 5 కి.మీ. పరుగు పందెం పోటీల్లో పెద్దతుంబళం గ్రామానికి చెందిన దొడ్డయ్య ప్రథమ స్థానంలో నిలిచి రూ. 3100, ద్వితీయ బహుమతి కోసిగి లక్ష్మన్న కు రూ.2100 అందజేశారు. అలాగే.. లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్ క్రీడల్లో గెలుపొందిన వారికి ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజు గౌడ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెట్టన గౌడ, ఎంపీపీ ఈరన్న నగదు బహుమతులు అందజేశారు.

## భక్తిశ్రద్ధలతో పల్లకీ సేవ



ఉత్సవ విగ్రహాలకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో ఉమామహేశ్వర స్వామికి సోమవారం పల్లకీ సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ తోట బుచ్చిరెడ్డిల ఆధ్వర్యంలో ఉమామహేశ్వరస్వామికి అభిషేకం, అర్చన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుంచి ఆలయం చుట్టూ పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో పాతపాడు గ్రామ సర్పంచ్ మహేశ్వరెడ్డి పాల్గొన్నారు.

## హనుమాన్ చాలీసా పారాయణం



హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న మహిళా భక్తులు

డోన్ టౌన్: శ్రావణ మాసం పురస్కరించుకుని స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలోని ప్రసన్న మండపంలో 21 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ సోమవారం తెలిపారు. హిందూ సంప్రదాయాలు, సనాతన ధర్మం కాపాడడం కోసం, విశ్వశాంతి, ప్రజల ఆయురారోగ్యాలతో పాటు గ్రామంలో సమృద్ధిగా వర్షాలు పడాలని హనుమాన్ చాలీసా పారాయణం చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, మహా మంగళ హారతి, నివేదన వంటి కైంకర్యాలు జరిపించినట్లు తెలిపారు.

## పల్లకీలో విహరించిన మహానందీశ్వరుడు




మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ గంగా, శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు రవిశంకర అవధాని, హనుమంతు శర్మ, అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు జరిపించారు. గోమాతను పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకీ ముందు కొలువు చేసి ఆలయ ప్రాకారంలో పల్లకోత్సవం కనులపండువగా చేశారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

### బాలుడికి పాముకాటు

జూపాడుబంగ్లా: కిరాణం కొట్టు నుంచి ఇంటికి వెళ్తున్న తొమ్మిదేళ్ల ఆదివిష్ణు అనే బాలుడు పాముకాటుకు గురైన ఘటన మండలంలోని తాటిపాడు గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు కుమారుడు ఆదివిష్ణు కిరాణంకొట్టు వద్ద సరుకులు తీసుకొని ఇంటికి వెళ్లసాగాడు. రోడ్డుపై వెళ్తుండగా కాలుకు పాము కాటువేయటంతో అతను భయాందోళతో ఇంటికి పరుగులు తీశాడు. జరిగిన విషయాన్ని కుటుంబసభ్యులకు తెలపటంతో వారు అతన్ని కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## పశువుల యజమానులపై చర్యలు తీసుకోవాలి



లంపీ స్కిన్ వ్యాధిబారిన పడిన ఆవును రోడ్డుపై వదిలేసిన దృశ్యం

డోన్ టౌన్: పట్టణంలో రోడ్లపై విచ్చల విడిగా పశువులను వదిలేస్తున్న యజమానులపై చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు. వాటి పోషణ పట్టించుకోకుండా వదిలేయడంతో మేత దొరక్క చెత్త, ప్లాస్టిక్ కవర్లు తిని అనారోగ్యానికి గురవుతున్నాయి. ఇటీవల తెల్లజాతి పశువులకు ప్రాణాంతకమైన లంపీ స్కిన్ వ్యాధి సోకుతోంది. ఇది అంటు వ్యాధి కావడంతో వ్యాధి సోకిన పశువులను మిగతా పశువులకు దూరంగా ఉంచి వైద్యం చేయించాల్సిన యజమానులు పట్టించుకోకుండా రోడ్లపై వదిలేస్తున్నారు. మున్సిపల్, పోలీసు అధికారులు స్పందించి రోడ్లపై పశువులను వదిలేసే యజమానులపై చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.